సాక్షి
పెద్దపల్లి
శనివారం ; 21 ; జనవరి ; 2023



వైభవంగా మహాలింగార్చన

వేములవాడ: రాజన్న సన్నిధిలో మాసశివ రాత్రిని పురస్కరించుకుని శుక్రవారం రాత్రి మహాలింగార్చన వైభవంగా నిర్వహించారు.



గోదావరిలో పుణ్యస్నానాలు

ధర్మపురి: వివిధ ప్రాంతాలకు చెందిన వేలాది మంది భక్తులు శుక్రవారం గోదావరి నదిలో పుణ్య స్నానాలు ఆచరించారు.

గరిష్టం/కనిష్టం
30.0 /18.0

వాతావరణం

ఆకాశం నిర్మలంగా ఉంటుంది. అప్పుడప్పుడు మేఘావృతం అవుతుంది. గాలిలో తేమ అధికంగా ఉంటుంది. ఈదురుగాలులు వీస్తాయి.

తవ్వుతారా.. ఆపుతారా?

ఈనెల 23న పర్యావరణ ప్రజాభిప్రాయ సేకరణ



మానేరులో ఇసుక తవ్వకాలు

- జిల్లాలోని మానేరు నుంచి జోరుగా ఇసుక రవాణా
- దూసుకెళ్తున్న లారీలు.. పోతున్న ప్రాణాలు
- దెబ్బతింటున్న రోడ్లు.. భయపెడుతున్న వరుస ప్రమాదాలు
- ఇసుక తవ్వకాలపై నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్‌కు ఫిర్యాదు
- మానేరువాగు పరిధిలో 21 అనుమతి ఉన్న క్వారీలు

సుల్తానాబాద్(పెద్దపల్లి): దారివెంట వెళ్తుంటే కంటి నిండాదుమ్ము. రోడ్డు ఎక్కాలంటే వెన్నులో వణుకు. వేగంగా దూసుకొచ్చే ఇసుక లారీలు. పదుల సంఖ్యలో వరుసలు. గంటల కొద్ది ట్రాఫిక్ జామ్‌లు. ప్రమాదాలు జరుగుతున్నా పట్టించుకోని అధికారులు.. ఇదీ పెద్దపల్లి జిల్లాలోని మానేరువాగు పరిధిలో నివసించే ప్రజలకు నిత్యం కనిపించే ప్రత్యక్ష నరకం. జిల్లాలోని సుల్తానాబాద్ మండలం గొల్లపల్లి నుంచి ప్రారంభమయ్యే మానేరువాగు పరిధి మంథని పరిధిలోని అడవిసోమనపల్లిలో గోదావరిలో కలుస్తుంది. దాదాపు వంద కిలోమీటర్ల దూరం ఉండే వాగులో 21 అధికారిక ఇసుక తవ్వకాల క్వారీలు ఉండగా.. అనుమతి లేనివి ఎన్నో. వాగులో కొన్నేళ్లుగా ఇసుక అక్రమ రవాణా జోరుగా సాగుతోంది. అనుమతి ఉన్నా.. లేకున్నా ట్రాక్టర్లు, లారీల్లో యథేచ్ఛగా ఇసుకను జిల్లా దాటిచ్చేస్తున్నారు. మానేరులో ఇసుక తవ్వకాలతో పర్యావరణ సమస్యలు ఏర్పడుతుండగా.. రవాణాతో జిల్లాలోని చాలా ప్రాంతాల్లో ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారని జిల్లా మైనింగ్ డిపార్టుమెంట్‌పై నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ ఆగ్రహం వ్యక్తం చేసింది. ఎన్జీటీ తెలంగాణ మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్‌తోపాటు కలెక్టర్‌కు నోటీసులు ఇచ్చింది. ఈనెల 23న పర్యావరణ ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించి నివేదిక అందించాలని సూచించింది. ఈ క్రమంలో మానేరులో అక్రమ ఇసుక తవ్వకాలు ఆపుతారా? కొనసాగిస్తారా అనే సందిగ్ధం నెలకొంది.

- జిల్లాలో ఇసుక అక్రమ రవాణా జోరుగా సాగుతోంది. మానేరువాగులో అనుమతి ఉన్న క్వారీలు 21 ఉండగా.. అనుమతి లేనివి చాలా ఉన్నాయి. పెద్దపల్లి నియోజకవర్గం పరిధిలో 19 అనుమతి ఉన్న క్వారీలు కొనసాగుతుండగా.. మంథని పరిధిలో రెండు క్వారీల్లో ఇసుక తవ్వకాలు సాగిస్తున్నారు.
- సుల్తానాబాద్ మండలం తొగర్రాయి, కదంబాపూర్, గట్టెపల్లి, ఓదెల మండలం గుంపుల, ఇందుర్తి, కనపర్తి, గుండ్లపల్లిలో 2, మడక, కాల్వ శ్రీరాంపూర్ మండలం కిష్టంపేట, మీర్జంపేట, మొట్లపల్లితో పాటు పలు గ్రామాల్లో ప్రభుత్వం ఇసుక తవ్వకాలకు అనుమతి ఇచ్చింది.
- నిబంధనల ప్రకారం పర్యావరణానికి హాని కలగకుండా ఇసుక తవ్వకాలు చేపట్టాలి. కానీ జిల్లాలోని కాంట్రాక్టర్లు అవేమీ పట్టించుకోవడం లేదు. లారీల్లో అధికలోడుతో ఇసుక తరలిస్తున్నారు. వంతెనలు, చెక్‌డ్యాంల వద్ద నిబంధనలకు విరుద్ధంగా ఇసుక తవ్వుతున్నారనే ఫిర్యాదులు ట్రిబ్యునల్‌కు వెళ్లాయి.
- ఇసుక తవ్వకాలతో మానేరు పరీవాహక ప్రాంత రైతుల బావుల్లో భూగర్భ జలాలు అడుగంటిపోతున్నాయి. బోర్లు వట్టిపోతున్నాయి. ఇసుక క్వారీలకు అనుమతి ఇచ్చే ముందు ప్రభుత్వం స్థానిక రైతులు, గ్రామ ప్రజల నుంచి గ్రామసభ ద్వారా అనుమతి తీసుకోవాలి. ప్రభుత్వం ఆ నిబంధనలేమీ పాటించలేదు.
- సుమారు 15 కిలోమీటర్ల నది పొడవునా 21 ఇసుక క్వారీలకు అధికారికంగా అనుమతి ఇవ్వగా.. అక్రమార్కులు మరోపది చోట్ల అక్రమంగా ఇసుకను తవ్వుతూ.. యథేచ్ఛగా పట్టణాలకు తరలిస్తున్నారు.
- ఇసుక ఓవర్‌లోడ్ లారీలతో రోడ్లు దెబ్బతింటున్నాయి. ప్రయాణికులు దుమ్ముతో ఇబ్బంది పడుతున్నారు. కాల్వశ్రీరాంపూర్, ఓదెల, సుల్తానాబాద్ మండలాల్లో ప్రజలు ఇసుక రవాణాపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నిబంధనలకు విరుద్ధంగా నడిచే లారీలపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. సుల్తానాబాద్, పెద్దపల్లి పట్టణాల్లో ఇసుక లారీల కారణంగా ప్రమాదాలు జరిగి పలువురు మృత్యువాత పడ్డారు.

పోరాటం ఆపేది లేదు



మానేరులో ఇసుక తవ్వకాలు ఆపే వరకు ఉద్యమం ఆపేది లేదు. రీచ్‌ల విషయంలో ఈనెల 23వ తేదీన హరిత ట్రిబ్యునల్ తుది విచారణ పూర్తికానుంది. భూగర్భ జలాలు అడుగంటి రైతులకు పంటల ఎండిపోయే ప్రమాదం ఉంది. ముందు జాగ్రత్తగా పోరాటం చేస్తున్నాం.

– గొట్టిముక్కుల సురేశ్‌రెడ్డి, బీజేపీ నేత

ప్రభుత్వ అనుమతితోనే



ప్రభుత్వ అనుమతితోనే జిల్లా పరిధిలోని మానేరువాగులో ఇసుక తవ్వకాలు సాగుతున్నాయి. నిబంధనలకు విరుద్ధంగా జరిగితే చర్యలు తప్పవు. కొందరు అక్రమంగా ఇసుక తరలిస్తున్నట్లు సమాచారం ఉంది. వారిపై కఠిన చర్యలు తీసుకుంటాం. హరిత ట్రిబ్యునల్ ఆదేశం మేరకే వ్యవహరిస్తాం. – సాయినాథ్, జిల్లా మైనింగ్ అధికారి

నేషనల్ గ్రీన్‌ట్రిబ్యునల్‌కు ఫిర్యాదు

ఈ క్రమంలో పర్యావరణ అనుమతి లేకుండానే మానేరులో ఇసుక తవ్వకాలకు తెలంగాణ ప్రభుత్వం అనుమతి ఇచ్చిందని, 15 కిలోమీటర్ల మేర ఇష్టానుసారంగా వాగు నుంచి ఇసుకను తరలించుకుపోతూ పర్యావరణానికి హాని కలిగిస్తున్నారని పెద్దపల్లికి చెందిన బీజేపీ నేత గొట్టిముక్కుల సురేశ్‌రెడ్డి, రిటైర్డ్ ఉద్యోగి, మానేరు పరిరక్షణ కమిటీ చైర్మన్ కరుణాకర్ రెడ్డి మరి కొందరు నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్‌ను ఆశ్రయించారు. ఇందుకు సంబంధించిన ఆధారాలు సమర్పించారు. అక్రమ మైనింగ్ విషయంలో స్పందించిన ఎన్జీటీ తెలంగాణ మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్‌తో పాటు కలెక్టర్‌కు నోటీసులు ఇచ్చింది. ఈనెల 23న పర్యావరణ ప్రజాభిప్రాయ సేకరణ చేసి నివేదిక ఇవ్వాలని ఆదేశించింది. ఎన్విరాన్‌మెంట్ క్లియరెన్స్ లేకుండా ఇసుక తవ్వకాలు జరపొద్దని సూచించింది. ఈ క్రమంలో మానేరు పరిరక్షణ సమితి ప్రత్యేక కార్యాచరణతో సిద్ధమవుతోంది.

న్యూస్‌రీల్

మొగిపురుగు నివారణకు మందులు చల్లాలి



వరిని పరిశీలిస్తున్న డీఏవో ఆదిరెడ్డి

ఓదెల(పెద్దపల్లి): వరికి సోకుతున్న(కాండం తొలిచేపురుగు) మొగిపురుగు నివారణకు మందులు స్ప్రే చేయాలని జిల్లావ్యవసాయాధికారి ఆదిరెడ్డి సూచించారు. శుక్రవారం ఓదెల మండలం గుండ్లపల్లె గ్రామంలో ఆయిల్‌పాం పంటల సాగుపై రైతులతో అవగాహన సదస్సు నిర్వహించి, వరికి సోకిన మొగిపురుగును పరిశీలించారు. డీఏవో మాట్లాడుతూ.. మొగిపురుగు నివారణకు క్లోరాంట్రనిలిప్రోల్ 0.4జి గుళికలు వేయాలన్నారు. లేదా 2గ్రాముల కార్టోప్ హైడ్రోక్లోరైడ్ 50ఎస్పీ మందును లీటర్ నీటికి కలిపి పిచికారీ చేయాలన్నారు. పొలాలు ఆరబెడుతూ వేర్లను కదిలించితే ఆక్సిజన్ అందించటం ద్వారా వేరుతెగుళ్లను తగ్గించవచ్చుఅని అన్నారు. సర్పంచ్ పులుగు తిరుపతి రెడ్డి, ఎంపీటీసీ ఆరెల్లి మొండయ్య, జిల్లా రైతు సమన్వయ సమితి డైరెక్టర్ పిట్టల రవికుమార్, ఆయిల్‌పాం సీఈవో గేషుకల్యాణ్‌కర్, సిద్దాంత్, ఏవో నాగార్జున, ఏఈవో సతీశ్ ఉన్నారు.

రాములోరి తలంబ్రాల వడ్ల గింజలు పంపిణీ



తలంబ్రాల వడ్లను అందిస్తున్న తిరుపతి

జ్యోతినగర్: భద్రాచల రాముడి కల్యాణానికి అవసరమైన తలంబ్రాల వడ్లగింజలను శుక్రవారం ఎన్టీపీసీ అన్నపూర్ణకాలనీలో తెలంగాణ మహిళా మిత్ర స్వచ్ఛంద సేవాసంస్థ ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. గోలివాడ చంద్రకళ భద్రాచలంలోని భక్త రామదాసు తిరుపతి ప్రత్యేకంగా పండించిన తలంబ్రాల వడ్ల గింజలను మేడి తిరుపతి చేతుల మీదుగా మహిళలకు అందించారు. మార్చి 30న భద్రాచలం సీతారాముల కల్యాణానికి వడ్లను గోటితో ఒలిచి పంపించడం జరుగుతుందని వివరించారు. 50మంది మహిళలకు తలంబ్రాల వడ్లను అందించారు. సరిత, లక్ష్మీ, సునీత, స్రవంతి, అంజలి, స్వరూపరాణి, సింధూజా, సోనియా, తదితరులు ఉన్నారు.

బల్దియాలో మూడు రోజులు తాగునీరు బంద్

కోల్‌సిటీ: రామగుండం నగరపాలక సంస్థ పరిధిలో మూడు రోజులపాటు తాగునీటి సరఫరాను నిలిపివేస్తున్నట్లు నగరపాలక కమిషనర్ బి.సుమన్‌రావు తెలిపారు. ముర్మూర్ పంప్‌హౌజ్ వద్ద నిర్మాణ పనులు చేపడుతున్న కారణంగా, నీటి సరఫరాను ఈనెల 22 నుంచి 24 వరకు మిషన్ భగీరథ అధికారులు నిలిపివేస్తున్నారని, దీంతో రామగుండం నగర పరిధిలో మూడు రోజులపాటు తాగునీటి సరఫరాకు అంతరాయం ఏర్పడనుందన్నారు. నగర ప్రజలు నీటిని పొదుపుగా వాడుకొని సహకరించాలని కమిషనర్ కోరారు.

మైనార్టీ స్కూళ్లు, కాలేజీల్లో ప్రవేశానికి దరఖాస్తుల స్వీకరణ

పెద్దపల్లిరూరల్: జిల్లాలోని మూడు మైనార్టీ కాలేజీల్లో ప్రవేశం పొందగోరే విద్యార్థుల నుంచి, మైనార్టీ పాఠశాలల్లోని 5వతరగతిలో మొత్తం సీట్లతో పాటు 6,7,8 తరగతుల్లో మిగిలిన సీట్లలో ప్రవేశం పొందాలనుకునే విద్యార్థుల నుంచి దరఖాస్తులను ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో స్వీకరిస్తున్నామని జిల్లా మైనార్టీ సంక్షేమాధికారి మెహరాజ్ తెలిపారు. మైనార్టీ కాలేజీల్లో ఎంపీసీ, బైపీసీ, ఎంఈసీ, సీఈసీ కోర్సులలో ప్రవేశం పొందాలనుకునే విద్యార్థులు ఎలాంటి ఫీజు చెల్లించకుండానే దరఖాస్తులను ఈనెల 30లోగా సమర్పించాలన్నారు. ఆఫ్‌లైన్‌లో దరఖాస్తులు ఇచ్చేవారు ఆయా కాలేజీల ప్రిన్సిపాల్‌లకు నేరుగా అందించాలని కోరారు. మైనార్టీస్కూల్ పెద్దపల్లిలో చేరాలనుకునే వారు సెల్‌నంబరు 7331170848లో, పెద్దపల్లి గర్ల్స్ కాలేజీ కోసం 9603313883లో సంప్రదించాలన్నారు. రామగుండం బాలురస్కూల్, కాలేజీ కోసం 7331170845, మంథని గర్ల్స్ స్కూల్ కోసం 7995057944, మంథని గర్ల్స్ కాలేజీ కోసం 8096286629 లో సంప్రదించవచ్చని వివరించారు.

పత్తి క్వింటాలుకు రూ.8,121

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి వ్యవసాయ మార్కెట్‌లో శుక్రవారం పత్తి క్వింటాలు ధర గరిష్టంగా రూ. 8,121 పలికిందని మార్కెట్ కమిటీ ప్రత్యేక శ్రేణి కార్యదర్శి దేవరాజ్ పృథ్వీరాజ్ తెలిపారు. కనిష్టంగా రూ. 7,007, సగటు ధర రూ.7,911గా నమోదైందని పేర్కొన్నారు.

‘ఏసీడీ’ పేరిట సర్కారు దోపిడీ



ఆందోళన చేస్తున్న కాంగ్రెస్ నేతలు

పెద్దపల్లిరూరల్: విద్యుత్ వాడకపోయినా వినియోగదారులకు షాక్ కొట్టేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వ్యవహరిస్తున్నాయని పీసీసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే విజయరమణారావు అన్నారు. విద్యుత్ బిల్లులను అడ్డగోలు పెంచి రోజులు గడవకముందే ఏసీడీ పేరిట దోపిడీకి పాల్పడుతున్నారని కాంగ్రెస్ ఆధ్వర్యంలో శుక్రవారం జిల్లా ట్రాన్స్‌కో ఎస్‌ఈ ఆఫీసు ఎదుట నిరసన తెలిపి ఎస్‌ఈకి వినతిపత్రం ఇచ్చారు. వెంటనే ఏసీడీ వసూళ్లను రద్దుచేయాలని డిమాండ్ చేశారు. నాయకులు బి.సురేశ్ గౌడ్, మినుపాల ప్రకాశ్‌రావు, మల్లయ్య, సంపత్, శ్రీమాన్, సుభాశ్, కుమార్‌యాదవ్, అక్బర్‌అలీ, పూదరి చందు, తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగాల పేరుతో ఘరానా మోసం

- రూ.కోటి వరకు కుచ్చుటోపీ • కూపీ లాగుతున్న పోలీసులు • డీసీపీ స్థాయిలో విచారణ

గోదావరిఖని: కోల్‌బెల్ట్ ప్రాంతంలో ఉద్యోగాల పేరుతో ఘరానా మోసం వెలుగుచూసింది. నిరుద్యోగుల అవసరాలను అసరాగా చేసుకుని కొందరు వ్యక్తులు ముఠాగా ఏర్పడి భారీగా వసూళ్లకు పాల్పడినట్లుగా తెలుస్తోంది. గోదావరిఖనికి చెందిన వ్యక్తి ప్రధాన సూత్రదారిగా ఉన్నట్లు సమాచారం. బాధితుల ఫిర్యాదు మేరకు రంగంలోకి దిగిన గోదావరిఖని వన్‌టౌన్‌పోలీసులు ప్రధాన నిందితున్ని అదుపులోకి తీసుకున్నట్లు ప్రచారం జరుగుతోంది. మిగితావారిని కూడా పోలీసు స్టేషన్‌కు పిలిపించినట్లు తెలిసింది. సుమారు రూ.కోటివరకు నిరుద్యోగుల నుంచి సొమ్ము తీసుకుని ఉద్యోగాలు ఇప్పించకుండా, ఇచ్చిన డబ్బులు తిరిగి ఇవ్వకుంగా ఇబ్బందులకు గురిచేస్తుండటంతో బాధితులు పోలీసులను ఆశ్రయించారు. ఈ క్రమంలో దీనిపై దృష్టి సారించిన డీసీపీ రూపేశ్ స్వయంగా రంగంలోకి దిగి పూర్తిస్థాయిలో కూపీ లాగుతున్నట్లు తెలిసింది. కాంట్రాక్టు ఉద్యోగాల పేరుతో నిరుద్యోగులు ఒక్కొక్కరి నుంచి రూ.4లక్షల నుంచి ఆపైన డబ్బులు తీసుకుని మోసం చేసినట్లు సమాచారం.

ఓటర్‌కార్డుతో ఆధార్ అనుసంధానం చేయాలి

- కొత్తగా నమోదైన ఓటర్లకు గుర్తింపు కార్డులు అందించాలి
- కలెక్టర్లతో ఎన్నికల ప్రధానాధికారి వికాస్‌రాజ్



వీసీలో పాల్గొన్న కలెక్టర్, అడిషనల్ కలెక్టర్, తదితరులు

పెద్దపల్లిరూరల్: ఓటరుకార్డుతో ఆధార్‌కార్డును అనుసంధానం చేయాలని, ఈ ప్రక్రియ గ్రామీణ ప్రాంతాల్లో పురోగతిలో ఉండగా, పట్టణ ప్రాంతాల్లోనే మందకొడిగా సాగుతోందని రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి వికాస్ రాజ్ అన్నారు. జిల్లా కలెక్టర్లతో శుక్రవారం జాతీయ ఓటరు దినోత్సం, ఓటరు కార్డుల జారీ, ఓటరు కార్డుతో ఆధార్ అనుసంధానం తదితర అంశాలపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈనెల 25న ఓటరు దినోత్సవం ఘనంగా నిర్వహించేలా ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. 80ఏళ్ల పైబడ్డ ఓటర్లను గుర్తించి సత్కరించాలన్నారు. కొత్తగా పేరు నమోదు చేసుకున్న ఓటర్లకు కార్డులు అందించడంతో సన్మానించాలని సూచించారు. జిల్లాలో ఓటరుకార్డుతో ఆధార్ అనుసంధాన ప్రక్రియ 60శాతం పూర్తయిందని కలెక్టర్ సంగీత వివరించారు. బీఎల్‌ఓలతో ప్రత్యేక సమావేశాలను ఏర్పాటు చేసి వందశాతం పూర్తయ్యేలా చూస్తామన్నారు. పెద్దపల్లి, రామగుండం ప్రాంతాలపై ప్రత్యేకదృష్టి సారిస్తామన్నారు. పెద్దపల్లి, మంథని ఆర్డీవోలు వెంకట మాధవరావు, వీరబ్రహ్మాచారి, సింగరేణి డెప్యూటీకలెక్టర్ నర్సింహమూర్తి, ఎన్నిల డెప్యూటి తహసీల్దార్ ప్రవీణ్ ఉన్నారు.

కంటివెలుగును సద్వినియోగం చేసుకోవాలి

పాలకుర్తి: కంటివెలుగు మలివిడత కార్యక్రమాన్ని జిల్లా పరిధిలోని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ సంగీత కోరారు. శుక్రవారం పాలకుర్తి మండలం బసంత్‌నగర్ వర్కర్స్ క్లబ్ ఆవరణలో, పుట్నూర్ గ్రామ పంచాయతీ ఆవరణలో నిర్వహిస్తున్న కంటివెలుగు కార్యక్రమాన్ని పరిశీలించారు. ఏర్పాట్లపై సంతృప్తి వ్యక్తం చేశారు. ప్రతిరోజు 150 మందికి తగ్గకుండా పరీక్షలు నిర్వహించేలా చర్యలు చేపట్టాలని అన్నారు. అనంతరం మనఊరు– మనబడి కార్యక్రమంలో భాగంగా అభివృద్ధి చేసిన జీడీనగర్, బసంత్‌నగర్ గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలలను పరిశీలించారు. పెండింగ్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. తహసీల్దార్ సునీత, ఎంపీడీవో లలిత, పంచాయతీరాజ్ ఏఈ శ్రీనివాస్, సర్పంచ్‌లు కట్టెకోల వేణుగోపాలరావు, రావుల శారద, సూర సమ్మయ్య, పీహెచ్‌సీ వైద్యాధికారి సాయిసూర్య, పుట్నూర్ క్యాంపు మెడికల్ ఆఫీసర్ అవినాష్ ఉన్నారు.

జిల్లాలో 5,528మందికి కంటి పరీక్షలు

పెద్దపల్లిరూరల్: జిల్లాలో శుక్రవారం కంటివెలుగు కార్యక్రమంలో భాగంగా 5,528 మందికి పరీక్షలు నిర్వహించినట్లు జిల్లా వైద్యాధికారి ప్రమోద్‌కుమార్ తెలిపారు. పరీక్షలు నిర్వహించిన వారిలో 1,420 మందికి లోపాలున్నట్లు గుర్తించామన్నారు. వారిలో 877 మందికి అప్పటికప్పుడే కళ్లజోడు అందించగా..మరో 760మందికి ప్రిస్కిప్షన్ అద్దాలు (ఆర్డర్) చేశామన్నారు. ఇతర పరీక్షల కోసం మెరుగైన వైద్యశాలలకు 498 మందికి రెఫర్ చేసినట్లు వివరించారు.

రైల్వే స్టేషన్లకు కొత్త సొబగులు!

- కరీంనగర్, పెద్దపల్లి, రామగుండం స్టేషన్లకు మహర్దశ
- ప్రత్యేక ప్రణాళిక ద్వారా అభివృద్ధి చేయనున్న ద.మ. రైల్వే
- ఏయే సదుపాయాలు కల్పించవచ్చో అధ్యయనం
- అమృత్ భారత్ కింద ప్రతీ స్టేషన్‌కు రూ.20 కోట్లు

సాక్షి ప్రతినిధి, కరీంనగర్: దక్షిణ మధ్య రైల్వే తన పరిధిలో ఉన్న స్టేషన్ల ఆధునికీకరణకు చర్యలు చేపడుతోంది. ఇటీవల సికింద్రాబాద్, హైదరాబాద్ డివిజన్లలో ఉన్న అన్ని స్టేషన్లలో ట్రాకుల సామర్థ్యం గంటకు 130 కి.మీ మేరకు పెంచిన విషయం తెలిసిందే. తాజాగా తన పరిధిలో ఉన్న మొత్తం 20 స్టేషన్లలో ఆధునికీకరణ పనులు చేపట్టి, కావాల్సిన సదుపాయాలు కల్పించేందుకు సౌత్ సెంట్రల్ రైల్వే సమాయత్తమవుతోంది. సదరు 20 స్టేషన్ల జాబితాలో కరీంనగర్, పెద్దపల్లి, రామగుండం, మంచిర్యాల స్టేషన్లు కూడా ఉన్నాయి. ఈ స్టేషన్లలో ప్రయాణికులకు ఏయే సదుపాయాలు కల్పించవచ్చో గుర్తించే పనిని టెండర్లు సొంతం చేసుకున్న టెక్నికల్ కన్సల్టెన్సీలు గుర్తించి, దక్షిణ మధ్య రైల్వేకు అందజేస్తాయి. సదరు నివేదికల ఆధారంగా కావాల్సిన సదుపాయాలు, పనులను ద.మ.రైల్వే చేపడుతుంది.

ఉమ్మడిజిల్లాలో మూడు స్టేషన్లు..!

ఉమ్మడి జిల్లాలో కరీంనగర్, పెద్దపల్లి, రామగుండం స్టేషన్లు కీలకమైనవి. ఇందులో పెద్దపల్లి, రామగుండం నిత్యం రద్దీగా ఉండే స్టేషన్లు.

- రాష్ట్రంలో తిరిగే రైళ్లతోపాటు మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, ఢిల్లీ తదితర ఉత్తరాది రాష్ట్రాలకు వెళ్లేందుకు ఈ రూటు ప్రధానం.
- ఇటీవల ఈ మార్గంలో మూడో రైలు మార్గం కూడా అందుబాటులోకి వచ్చింది. అలాగే.. ఈ మార్గంలో 130 కి.మీ వేగంతో వందేభారత్ రైలు వెళ్లేలా పట్టాల సామర్థ్యాన్ని దక్షిణ మధ్య రైల్వే అప్‌గ్రేడ్ చేసింది.
- తాజాగా స్టేషన్లలో సదుపాయాల కల్పనకు శ్రీకారం చుట్టడం శుభపరిణామం అని పలువురు ప్రయాణికులు వ్యాఖ్యానిస్తున్నారు.
- కన్సల్టెన్సీలు ఇచ్చే నివేదికల ఆధారంగా రైల్వేస్టేషన్ల ఆధునికీకరణకు ఉన్నతాధికారులు చర్యలు చేపడతారు.
- వీటి ప్రకారం.. స్టేషన్ల సుందరీకరణ, గోడలపై స్థానిక కళారూపాలు, చిత్రాలు వేయడం, ఫుట్ ఓవర్ బ్రిడ్జి, సైనేజ్ బోర్డులు, రెస్ట్ రూములు, వెయిటింగ్ రూములు, అదనపు, కౌంటర్లు, బెంచీలు, పార్కింగ్, లైటింగ్, హైలెవల్ ప్లాట్‌ఫారాలు, రైళ్ల రాకపోకలను తెలిపే డిజిటల్ బోర్డులు, దివ్యాంగులకు అవసరమైన సదుపాయాలు తదితరాలు కల్పిస్తారు.
- ముఖ్యంగా కరీంనగర్ రైల్వేస్టేషన్‌లో రెండో ప్లాట్‌ఫారం లేదు. అలాగే ఫుట్‌ఓవర్ బ్రిడ్జి లేదు. ఈ సదుపాయాల కోసం కొన్నేళ్లుగా ఉమ్మడి జిల్లావాసులు డిమాండ్ చేస్తున్నారు. ముఖ్యంగా కరీంనగర్ నుంచి తిరుపతి వెళ్లే ప్రయాణికులకు ఈ సదుపాయాలు ఎంతో ఉపయుక్తంగా ఉంటాయి.
- ప్రతీ ఆదివారం, గురువారం కరీంనగర్ నుంచి తిరుపతికి బయల్దేరే బై వీక్లీ ఎక్స్‌ప్రెస్ చాలా రద్దీగా ఉంటోంది. ప్రయాణికులతోపాటు వారి బంధువులతో ఆ రెండు రోజులు స్టేషన్ కిక్కిరిసిపోతోంది.
- ఒకటే ప్లాట్‌ఫారంతో ప్రయాణికులు, వారి బంధువులు నానా ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా సిరిసిల్ల, జగిత్యాల జిల్లాల నుంచి వచ్చిన వారి కష్టాలు చెప్పతరం కావు.



అమృత్ భారత్ కింద అభివృద్ధి..

అమృత్ (అటల్ మిషన్ ఫర్ రిజునవేషన్ అండ్ అర్బన్ ట్రాన్స్‌మిషన్) పథకం కింద దేశంలోని 1000 చిన్న రైల్వేస్టేషన్లు అభివృద్ధి చేయాలని కేంద్రం ఇటీవల నిర్ణయించింది. ఎంపిక చేసిన స్టేషన్లలో ప్రయాణికులకు కనీసం సదుపాయాలు కల్పించేలా వాటికి అవసరాన్ని బట్టి రూ.10 కోట్ల నుంచి రూ.20 కోట్లు కేటాయించనుంది. కన్సల్టెన్సీలు పని పూర్తిచేసిన అనంతరం వాటి నివేదిక ఆధారంగా సదుపాయాల కోసం ఉమ్మడి జిల్లాలోని కరీంనగర్, పెద్దపల్లి, రామగుండం స్టేషన్లకు కనీసం రూ.30 కోట్ల నుంచి రూ.60 కోట్లు కేటాయించే అవకాశాలు ఉన్నాయని అధికారులు తెలిపారు. ఈ నివేదికల ఆధారంగా అనేక రైల్వేస్టేషన్ల ముఖద్వారాల నిర్మాణం, అదనపు భవనాల నిర్మాణం, అవసరమైతే కారాల్యాలయాల తరలింపు కూడా చేపడతారు.

వేగంగా కొత్తపల్లి–మనోహరాబాద్ పనులు..

హైదరాబాద్–కరీంనగర్‌ను కలిపే ప్రతిష్టాత్మక ప్రాజెక్టు కొత్తపల్లి–మనోహరాబాద్. ఈ రైల్వే లైను ఇప్పటికే మనోహరాబాద్ నుంచి గజ్వేల్ వరకు పూర్తయ్యింది. సిరిసిల్ల జిల్లాలో సిరిసిల్ల నుంచి వేములవాడ వరకు పనులు వేగంగా నడుస్తున్నాయి. సిరిసిల్ల డివిజన్‌లోని తంగళ్లపల్లి వద్ద తమకు 37 ఎకరాలు కావాలని దక్షిణ మధ్య రైల్వే కోరగా సిరిసిల్ల కలెక్టర్ కేటాయించారు. ఈ భూమి కేటాయింపులు ఇటీవల పూర్తయ్యాయి. మరోవైపు తంగళ్లపల్లి నుంచి కొత్తపల్లి వరకు భూసేకరణ పనులు నడుస్తున్నాయి.

క్లుప్తంగా

మాస్టర్‌ప్లాన్ రద్దు చేయాలి


నగేశ్

ధర్మారం(ధర్మపురి): కామారెడ్డి, జగిత్యాల జిల్లాల రైతులకు నష్టం కల్గించే మాస్టర్ ప్లాన్‌ను ప్రభుత్వం వెంటనే రద్దు చేయాలని వైఎస్సార్‌టీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ నగేశ్ డిమాండ్ చేశారు. ధర్మారంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ, రెండు నెలలుగా మాస్టర్ ప్లాన్‌కు వ్యతిరేకంగా రైతులు పోరాటం చేస్తుంటే ప్రభుత్వం పట్టించుకోకపోవడం దుర్మార్గమన్నారు. జగిత్యాల మున్సిపల్ కౌన్సిల్‌లో మాస్టర్‌ప్లాన్‌కు వ్యతిరేకంగా తీర్మానం చేశారని, రైతుల అభిప్రాయానికి వ్యతిరేకంగా, మున్సిపల్ తీర్మానానికి విరుద్ధంగా అమలు చేస్తామనడం సరికాదన్నారు. గతంలో ఎస్సారెస్పీ కెనాల్ నిర్మాణాలకు రైతులు భూములను ఇవ్వగా ప్రస్తుతం మాస్టర్‌ప్లాన్ కోసం రైతుల భూముల తీసుకుంటే వారు ఎలా జీవిస్తారని ప్రశ్నించారు. ప్రభుత్వం రైతుల పక్షాన ఆలోచించి మాస్టర్‌ప్లాన్‌ను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

24, 25న జెడ్పీ స్థాయీ సంఘ సమావేశాలు

పెద్దపల్లిరూరల్: జిల్లా పరిషత్ స్థాయీ సంఘ సమావేశాలు ఈనెల 24, 25 తేదీల్లో జెడ్పీ చైర్మన్ పుట్ట మధుకర్ అధ్యక్షతన నిర్వహించనున్నట్లు సీఈఓ శ్రీనివాస్ తెలిపారు. 24న 3,5,6వ, 25న 1,2,4,7వ స్థాయీ సంఘ సమావేశాలుంటాయన్నారు. సమావేశాలకు జిల్లా అధికారులు పూర్తి సమాచారంతో సకాలంలో హాజరు కావాలని కోరారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత


తహసీల్ కార్యాలయంలో ఇసుక ట్రాక్టర్లు

సుల్తానాబాద్(పెద్దపల్లి): అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్లను మండల కేంద్రంలో రెవెన్యూ అధికారులు పట్టుకున్నారు. శుక్రవారం మండలంలోని నీరుకుల్ల, గట్టెపల్లి గ్రామాల మానేరు వాగు నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్నారనే సమాచారం మేరకు రెవెన్యూ అధికారులు 8 ట్రాక్టర్లను పట్టుకొని రెవెన్యూ కార్యాలయానికి తీసుకువచ్చారని తహసీల్దార్ యాకన్న తెలిపారు. నిబంధనలకు విరుద్ధంగా నడిచే ట్రాక్టర్లపై జరిమానా విధిస్తామని తెలిపారు.

టీఎస్‌పీ కరపత్రం ఆవిష్కరణ


కరపత్రం ఆవిష్కరిస్తున్న నాయకులు

రామగుండం: తెలంగాణ లేబర్ పార్టీ(టీఎల్‌పీ) కరపత్రాలను శుక్రవారం ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు గొర్రె రమేశ్ రామగుండంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో రామగుండం నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా పోటీ చేయనున్నట్లు తెలిపారు. సింగరేణిలో గత 11 సంవత్సరాలు పని చేశానని, నియోజకవర్గం అభివృద్ధి చేయడానికి తనకు సరైన అవగాహన ఉందని, అవకాశం ఇస్తే అభివృద్ధి చేసి చూపిస్తానని వెల్లడించారు. కార్యక్రమంలో జె.కవిత, జి.రమేష్, ఓ.నర్సయ్య, ఎండీ.నసీరుద్దీన్, ఎన్.రాజయ్య, పి.సురేశ్, జీ.ఎస్.రావు, కె.శివరాం పాల్గొన్నారు.

ఎత్తిపోతల్లో కదలిక

- రూ.320 కోట్ల మంజూరుకు ఆర్థికశాఖ అనుమతి
- కాళేశ్వరం ప్రాజెక్టుతో అనుసంధానం
- అన్నదాతల్లో చిగురిస్తున్న ఆశలు


పథకం ప్రతిపాదిత ప్రాంతంలో మ్యాప్ ఆధారంగా సర్వే నిర్వహిస్తున్న అధికారులు (ఫైల్)

మంథని: కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా నిర్మించిన పార్వతీ బ్యారేజీకి అనుసంధానంగా ప్రతిపాదిత పోతారం ఎత్తిపోతల పథకంలో కదలిక వచ్చింది. రూ.320 కోట్లతో చేపట్టనున్న పథకానికి ఆర్థికశాఖ అనుమతి లభించింది. పరిపాలన అనుమతికి రెండు రోజుల్లో సీఎం కేసీఆర్ ముందుకు ఫైల్ వెళ్లనుంది. నాలుగేళ్లుగా ఎత్తిపోతల కోసం ఎదురుచూస్తున్న అన్నదాతల్లో ఆశలు చిగురిస్తున్నాయి.

నాలుగు నెలల్లోనే చకచకా..

మంథని మండలం పోతారం వద్ద ఎత్తిపోతలకు 2018లో ప్రతిపాదనలు చేయగా పథకం ముందుకు సాగలేదు. కాగా పెద్దపల్లి కలెక్టరేట్ భవన సముదాలయాల ప్రారంభోత్సవానికి సీఎం కేసీఆర్ ఆగస్టు 29న హాజరైనప్పుడు జెడ్పీ చైర్మన్ పుట్ట మధు పోతారం పథకంపై విజ్ఞప్తి చేశారు. స్పందించిన సీఎం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని ఆదేశించడంతో నాలుగేళ్లుగా ప్రతిపాదనలకే పరిమితమైన పథకం 4 మాసాల్లో చకచకా ముందుకు సాగుతోంది.

30 వేల ఎకరాలకు ప్రయోజనం

జిల్లాలో మంథని నియోజకవర్గం టెలెండ్ ప్రాంతం. వర్ష ఆధారితంగా పంటలు సాగు చేస్తున్నారు. వ్యవసాయ పంపుసెట్లు ఉన్నా వర్షభావంతో అవికాస్త ఎత్తిపోయాయి. దీంతో రైతులు సాగునీటి కోసం తీవ్ర అవస్థలు పడుతున్నారు. ఎస్సారెస్పీ నుంచి డీ–83 ద్వారా వచ్చే నీరు కేవలం కమాన్‌పూర్, రామగిరి మండలాల్లోని కొన్ని గ్రామాల రైతుల ఆరుతడి పంటలకు అందుతుంది. దీంతో మంథని, ముత్తారం, రామగిరి మండలాల్లోని చివరి ఆయకట్టుకు సాగునీరు అందడం లేదు. చాలా కాలంగా సాగు భూములు బీళ్లుగా ఉంటున్నాయి. కాగా డీ–83 కాలువపై భారాన్ని తగ్గించడమే కాకుండా ఎస్సారెస్పీ ఆయకట్టు పరిధిలోని 20 వేల ఎకరాలు, టెలెండ్‌లో ఉన్న చివరి భూములు, కొత్తగా 10 వేల ఎకరాలు సాగులోకి రానున్నాయి.

మూడుపైపుల ద్వారా 3 టీఎంసీలు

మంథని మండలం పోతారం– విలోచవరం గ్రామాల మధ్య ఎత్తిపోతల పథకం ద్వారా 3 టీఎంసీలు ఎత్తిపోయాలని అధికారులు ప్రతిపాదించారు. పోతారం నుంచి సుందిళ్ల, ఎల్–8 నుంచి చల్లపల్లి, ఎల్–6 నుంచి కన్నాల వరకు 3 పైపులైన్లను ఏర్పాటు చేసి సాగునీరు సరఫరా చేయనున్నారు. దీంతో మంథని, ముత్తారం, రామగిరి మండలాల్లోని చివరి ఆయకట్టున ఉన్న బీడు భూములు సాగులోకి రానున్నాయి.

ప్రభుత్వ అనుమతికి ప్రతిపాదనలు



మంథని డివిజన్‌లో 30 వేల ఎకరాలకు ప్రయోజనం కలిగేలా పోతారం ఎత్తిపోతల పథకం ప్రతిపాదనలు పంపాం. సీఎం ఆదేశాలకు మేరకు పథకం రూపకల్పన జరిగింది. డివిజన్‌లో బీడు భూములు లేకుండా సాగులోకి వస్తాయి. త్వరలోనే ప్రభుత్వం నుంచి ఆమోదం వస్తుందని ఆశిస్తున్నాం.

– నల్లా వెంకటేశ్వర్లు, ఈఎన్‌సీ

క్రికెట్ ఆడుదాం.. ప్రతిభను చాటుదాం

ఈ నెల 22 సాక్షి ప్రీమియర్ లీగ్ క్రికెట్ టోర్నీ ఎంట్రీలకు చివరి తేదీ

SAKSHI
SAKSHI DIGITAL
MEDIA GROUP

SPL
SAKSHI PREMIER LEAGUE

బ్యాట్ పట్టుకొని బంతిని బౌండరీ దాటించాలని ఉందా? బుల్లెట్ వేగంతో బంతులు వేస్తూ వికెట్లను గిరాటేయాలని ఉందా? మెరుపు వేగంతో కదులుతూ బ్యాటర్లను రనౌట్ చేయాలని ఉందా? క్రికెట్ ఆడేద్దామని.. మనలోని ప్రతిభను ప్రపంచానికి చాటి చెప్పాలని మనసులో బలమైన కోరిక ఉంటే సరిపోదు.. దానికి వేదిక కూడా కావాలిగా! ఇలాంటి ఔత్సాహిక క్రికెటర్లు తమ కలలు నెరవేర్చుకునేందుకు మళ్లీ సమయం వచ్చేసింది. మరో ఆలోచన లేకుండా ముందుగా మీ జట్టును తయారు చేసుకొని ఎంట్రీలు పంపించండి.. ఆ తర్వాత సమరానికి సై అనండి.

Regional sponsor
SUDHAKAR
PIPES AND FITTINGS
LEADER IN QUALITY AND TECHNOLOGY

ఔత్సాహిక క్రికెటర్లకు సువర్ణావకాశాలు కల్పించాలనే సదుద్దేశంతో సాక్షి మీడియా గ్రూప్ ఆధ్వర్యంలో ఈ నెల(జనవరి) నాలుగో వారంలో సాక్షి ప్రీమియర్ లీగ్ (ఎస్‌పీఎల్) క్రికెట్ టోర్నీ నాలుగో సీజన్ మొదలుకానుంది.

టోర్నీ ఫార్మాట్..

ముందుగా జిల్లా, ప్రాంతీయ, రాష్ట్ర స్థాయిలో నాకౌట్ పద్ధతిలో మ్యాచ్‌లు జరుగుతాయి. ఈ మ్యాచ్‌లను 10 ఓవర్లపాటు నిర్వహిస్తారు. జిల్లా స్థాయిలో విజేతగా నిలిచిన జట్లు ప్రాంతీయ స్థాయి టోర్నీకి అర్హత సాధిస్తాయి. ఈ మ్యాచ్‌లను 20 ఓవర్లపాటు నిర్వహిస్తారు. ప్రాంతీయ స్థాయి టోర్నీ విజేతలు రాష్ట్ర స్థాయిలో రౌండ్ రాబిన్ లీగ్ పద్ధతిలో టైటిల్ కోసం తలపడతాయి. ఉమ్మడి జిల్లాలే ప్రాతిపదికగా ఎంట్రీలు స్వీకరిస్తారు.

ఎంట్రీ ఫీజు..

ఈ టోర్నీలో పాల్గొనాలనుకునే జట్లు రూ.1,500 ఎంట్రీ ఫీజుగా చెల్లించాల్సి ఉంటుంది. ఈ మొత్తాన్ని ఆన్‌లైన్‌లోనూ, ఆఫ్‌లైన్ పద్ధతిలోనూ చెల్లించవచ్చు. వివరాలకు సాక్షి జిల్లా యూనిట్ కార్యాలయంలో సంప్రదించాలి. https://www.arenaone.in/registration వెబ్‌సైట్‌లోనూ వివరాలు లభిస్తాయి. ఎంట్రీలను ఈ నెల 22తేదీలోపు పంపించాలి.

ఏ ఏ విభాగాల్లో...

ఈ లీగ్‌ను రెండు కేటగిరీల్లో నిర్వహిస్తారు. అండర్–19 జూనియర్ స్థాయిలో (1 జనవరి 2003 తర్వాత జన్మించి ఉండాలి). అండర్–25 సీనియర్ స్థాయిలో (1 జనవరి 1997 తర్వాత జన్మించి ఉండాలి) వేర్వేరుగా నిర్వహిస్తారు.

జూనియర్ స్థాయిలో ఆడేందుకు జూనియర్ కాలేజీ జట్లకు, సీబీఎస్‌ఈ స్కూల్ (ప్లస్ 1, 2) జట్లకు, ఐటీఐ, పాలిటెక్నిక్ జట్లకు అర్హత ఉంది. సీనియర్ స్థాయిలో ఆడేందుకు డిగ్రీ, పీజీ, మెడిసిన్, ఇంజనీరింగ్, ఫార్మా కాలేజీ జట్లకు అవకాశం కల్పిస్తారు.

ఎన్ని జట్లకు అవకాశం..

ఒక్కో కాలేజీ నుంచి గరిష్టంగా రెండు జట్లను పంపించే వెసులుబాటు ఉంది. రెండు జట్లు కూడా వేర్వేరుగా ఎంట్రీ ఫీజు చెల్లించాలి. ఒక జట్టులో ఆడే ఆటగాడు మరో జట్టుకు ఆడకూడదు. మ్యాచ్‌లు ఆడే సమయంలో ఆటగాళ్లు వయసు ధ్రువీకరణ పత్రాలను చూపించాల్సి ఉంటుంది. మ్యాచ్ సమయంలో ఇరుజట్ల ఆటగాళ్లు తమ కళాశాల గుర్తింపు కార్డు (ఒరిజినల్) చూపించాలి. మ్యాచ్ జరిగే సమయంలో బ్యాటర్స్, వికెట్ కీపర్ తప్పనిసరిగా హెల్మెట్లు, లెగ్ ప్యాడ్‌లు, అండర్ గార్డ్స్, హ్యాండ్ గ్లౌవ్స్, వైట్ డ్రెస్, వైట్ షూస్ ధరించాలి.

ఇతర వివరాలకు నిర్వాహకులను సంప్రదించాల్సిన ఫోన్ నంబర్లు
95055 14424, 99124 40790
గమనిక : అన్ని విషయాల్లో నిర్వాహకులదే తుది నిర్ణయం.

తెలంగాణ ఉద్యమ స్ఫూర్తితో 'బాయిబాట'


మాట్లాడుతున్న ఎమ్మెల్యే చందర్

ఎమ్మెల్యే కోరుకంటి చందర్

గోదావరిఖని(రామగుండం): తెలంగాణ ఉద్యమ స్ఫూర్తితో బాయిబాటకు శ్రీకారం చుట్టానని రామగుండం ఎమ్మెల్యే కోరుకంటి చందర్ పేర్కొన్నారు. శుక్రవారం ఆర్జీ–2 ఏరియా వర్క్‌షాప్‌లో ఏర్పాటు చేసిన గేట్‌మీటింగ్‌లో మాట్లాడారు. ఈప్రాంత ప్రజల కష్టాలు తెలిసిన సింగరేణి కార్మికుని బిడ్డగా బొగ్గు బ్లాకుల ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా ఉద్యమానికి సిద్ధమైనట్లు పేర్కొన్నారు. సింగరేణి సంస్థ వరుస లాభాలతో ముందుకు సాగుతుంటే కేంద్రం ఆంక్షల పేరుతో బొగ్గు బ్లాకుల విక్రయాలకు దిగుతోందన్నారు. బడా వ్యాపారుల చేతుల్లో బొగ్గు బ్లాకులను పెట్టేందుకు కుట్ర జరుగుతోందన్నారు. పారిశ్రామిక వేత్తలకు లాభం చేకూరేలా చట్టాలు తెస్తున్నారని ఆరోపించారు. దీన్ని ఆదిలోనే అడ్డుకోకుంటే రాబోయే రోజుల్లో సంస్థ పరిస్థితి అగమ్యగోచరంగా తయారవుతుందన్నారు. కేంద్ర ప్రభుత్వ కుట్రలను వ్యతిరేకిస్తూ ఎర్రజెండాలు పోరాటం చేయకుంటే రాబోయే రోజుల్లో పూర్తిగా కనుమరుగవుతాయన్నారు. పారిశ్రామిక ప్రాంత ప్రజలకు పరిశుభ్రమైన నీటిని అందించేందుకు చిత్తశుద్ధితో ముందుకు సాగుతున్నానన్నారు. కార్యక్రమంలో మేయర్ అనిల్‌కుమార్, టీబీజీకేఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెంగర్ల మల్లయ్య, ఐలి శ్రీనివాస్, మాదాసు రామ్మూర్తి, శంకర్‌నాయక్, సాగంటి శంకర్, ప్రభాకర్‌రెడ్డి, సురేందర్ తదితరులు పాల్గొన్నారు.

డివిజన్ సమస్యలు పరిష్కరించండి సారూ..

- ముఖ్యమంత్రికి ఫిర్యాదు చేసిన 'ఖని' వాస్తవ్యుడు
- చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్‌కు కలెక్టర్ ఆదేశాలు

కోల్‌సిటీ(రామగుండం): రామగుండం నగరపాలక సంస్థలోని 11వ డివిజన్‌లో నెలకొన్న అనేక సమస్యలను అధికారులు పరిష్కరించడం లేదని, వెంటనే అభివృద్ధి పనులు పూర్తి చేసేలా చొరవ తీసుకోవాలని డివిజన్‌కు చెందిన బొడ్డు రాజేశం సీఎం కేసీఆర్‌కు గత నెలలో ఫిర్యాదు చేశాడు. దీంతో స్పందించిన ముఖ్యమంత్రి కార్యాలయం సమస్య పరిష్కారం దిశగా సంబంధిత అధికారులను ఆదేశించాలని సూచిస్తూ కలెక్టర్‌కు లేఖ వచ్చింది. బాధితుడు రాసిన లేఖ ఆధారంగా, వెంటనే చర్యలు తీసుకోవాలని నగరపాలక కమిషనర్‌కు కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. మున్సిపల్ కమిషనర్‌కు కలెక్టర్ జారీ చేసిన లేఖ శుక్రవారం తనకు అందిందని బాధితుడు తెలిపాడు. 11వ డివిజన్‌లో సరైన సీసీ రోడ్లు, డ్రెయినేజీ, వీధి దీపాలు లేక స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని సీఎంకు ఫిర్యాదు చేసినట్లు తెలిపాడు. రైల్వే ట్రాక్ పక్కన సీసీ రోడ్ల నిర్మాణం చేపట్టాలని కోరారు. గతంలో అనేకసార్లు మున్సిపల్ పాలవర్గానికి, అధికారులకు ఈ సమస్యలపై ఫిర్యాదు చేసినా పరిష్కరించలేదని ఆరోపించారు. దీనిపై సీఎంకు రెండుసార్లు ఫిర్యాదు చెయ్యాల్సి వచ్చిందని తెలిపాడు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశాడు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని ఒకరు మృతి


సమ్మయ్య (ఫైల్)

కమాన్‌పూర్(మంథని): మండలంలోని గుండారం గ్రామం వద్ద మంథని– పెద్దపల్లి ప్రధాన రహదారిపై గుర్తు తెలియని వాహనం ఢీకొని తూర్పాటి సమ్మయ్య (70) మృతిచెందాడు. స్థానికుల వివరాలు.. సమ్మయ్య తన కూమార్తె లావాణ్యను పెద్దపల్లి నుంచి గుండారం తీసుకొస్తున్న క్రమంలో వెనుకనుంచి వచ్చిన గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో సమ్మయ్య, లావణ్యకు తీవ్రగాయాలు అయ్యాయి. 108 అంబులెన్స్‌లో పెద్దపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లారు. సమ్మయ్య పరిస్థితి విషమించడంతో కరీంనగర్ తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. ప్రమాద స్థలాన్ని ఎస్సై షేక్ మస్తాన్ పరిశీలించి దర్యాప్తు చేస్తున్నారు.

నాటుసారా విక్రేతకు ఏడాది జైలు


తహసీల్దార్ శ్రీనివాస్ ఎదుట భీంసింగ్

కథలాపూర్(వేములవాడ): ఇప్పపెల్లి గ్రామానికి చెందిన నాటుసారా విక్రేత గుగ్లావత్ భీంసింగ్‌కు ఏడాది జైలు శిక్ష విధిస్తూ తహసీల్దార్ శ్రీనివాస్ ఆదేశాలు ఇచ్చారని ఆబ్కారీశాఖ సీఐ రాధ శుక్రవారం తెలిపారు. భీంసింగ్ గతంలో నాటుసారా విక్రయిస్తే పట్టుకొని తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేశామని పేర్కొన్నారు. బైండోవర్ నిబంధన ఉల్లంఘించి మళ్లీ నాటుసారా విక్రయిస్తుండగా పట్టుకున్నామని వివరించారు. ఈ మేరకు శుక్రవారం కథలాపూర్‌లో తహసీల్దార్ శ్రీనివాస్ ఎదుటు హాజరుపరచగా... ఏడాదిపాటు జైలు శిక్ష అనుభవించాలని ఆదేశాలు జారీచేశారని పేర్కొన్నారు. ఈమేరకు భీంసింగ్‌ను కరీంనగర్ జైలుకు తరలించామని సీఐ వివరించారు.

సేఫ్టీ మేనేజ్‌మెంట్ ప్లాన్ అమలు చేయాలి


మాట్లాడుతున్న జీఎం మనోహర్

గోదావరిఖని: సేఫ్టీ మేనేజ్‌మెంట్ ప్లాన్ సమర్థవంతంగా అమలు చేయాలని ఆర్జీ–2 జీఎం ఎ.మనోహర్ పేర్కొన్నారు. శుక్రవారం జీఎం కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాలులో ఏర్పాటు చేసిన రక్షణ సమీక్ష సమావేశంలో మాట్లాడారు. ప్రమాదాల నివారణకు పొందుపర్చిన రక్షణ పద్ధతులను ఖచ్చితంగా అమలు పర్చాలన్నారు. సమావేశంలో ఏరియా రక్షణ అధికారి బచ్చ రవీందర్, వీటీసీ మేనేజర్ శ్రీరంగారెడ్డి, ఓసీపీ–3 రక్షణ అధికారి భరత్‌కుమార్, మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ మహిపాల్ తదితరులు పాల్గొన్నారు.

వకీల్‌పల్లి గనిలో డ్యాంలను పరిశీలించిన జీఎం


పనిస్థలాల మ్యాప్‌ను పరిశీలిస్తున్న జీఎం

గోదావరిఖని(రామగుండం): వకీల్‌పల్లి గనిలో నిర్మించిన డ్యాంలను ఆర్జీ–2 జీఎం ఎ.మనోహర్ శుక్రవారం పరిశీలించారు. గనిలోని పనిస్థలాల వద్దకు చేరుకుని నీటిని నిలువరించే డ్యాంలను పరిశీలించి పూర్తి వివరాలు తెలుసుకున్నారు. కంటిన్యూస్ మైనర్‌లో సాధిస్తున్న బొగ్గు ఉత్పత్తి, రక్షణ తదితర వివరాలను ప్లాన్ ద్వారా తెలుసుకున్నారు. గనిలో కొన్ని రోజుల క్రితం ప్రారంభమైన సీటూ ప్లాంట్, కంటిన్యూస్‌మైనర్ సెక్షన్ పని స్థలాలను తనిఖీ చేశారు. ప్రమాదాలు జరగకుండా రక్షణతో కూడిన నిర్దేశిత బొగ్గు ఉత్పత్తి లక్ష్యాలను చేరుకోవాలని కోరారు. జీఎం వెంట ప్రాజెక్టు అధికారి శ్రీనివాస్‌రెడ్డి, మేనేజర్ రవికుమార్, గ్రూప్ ఇంజినీర్ చంద్రశేఖర్ తదితరులున్నారు.

ఆర్టీసీ అద్దెబస్సు డ్రైవర్ల డిమాండ్లు నెరవేర్చాలి


మద్దతు తెలుపుతున్న తిరుపతి

మంథని: ఆర్టీసీ అద్దెబస్సు డ్రైవర్ల డిమాండ్లను యాజమాన్యాలు నెరవేర్చాలని తెలంగాణ రైతుసంఘం జిల్లా కార్యదర్శి రాపెల్లి తిరుపతి డిమాండ్ చేశారు. అద్దె బస్సుడ్రైవర్ల సమ్మెకు ఆయన మద్దతు తెలిపారు. శుక్రవారం మంథనిలోని డ్రైవర్లను కలిసి మాట్లాడారు. ఆర్టీసీ డ్రైవర్లతో సమానంగా అద్దె బస్సుడ్రైవర్లు పని చేస్తున్నారన్నారు. ఆర్టీసీ డ్రైవర్లకు చెల్లించిన విధంగానే వేతనంతో పాటు పీఎఫ్, వైద్యం, బస్‌పాస్ సౌకర్యం కల్పించాలన్నారు.

ఇంటర్‌నేషనల్ సైన్స్ ఫెస్టివల్‌కు ఇద్దరు ఉపాధ్యాయులు

పెద్దపల్లిరూరల్: కేంద్ర ప్రభుత్వశాస్త్ర సాంకేతికశాఖ ఆధ్వర్యంలో ఏటా నిర్వహించే ఇండియా ఇంటర్నేషనల్ సైన్స్ ఫెస్టివల్‌కు జిల్లాకు చెందిన ఇరువురు ఉపాధ్యాయులు ఎంపికయ్యారని డీఈవో మాధవి తెలిపారు. జిల్లా సైన్స్ అధికారి రవినందన్‌రావు, రామగిరి మండలం వాణి హైస్కూల్ ఫిజిక్స్ టీచర్ కౌండిన్యలు శనివారం నుంచి భోపాల్‌లో జరిగే సైన్స్‌ఫెస్టివల్‌లో పాల్గొంటున్నారని వివరించారు. వారికి ఐఐఎస్‌ఎఫ్ నుంచి ఆహ్వానాలు అందాయన్నారు. ఈనెల 21నుంచి 24వరకు మౌలానా ఆజాద్ నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ఆవరణలో ఈ ఫెస్టివల్ జరుగుతుందన్నారు. ఆటలు బొమ్మల ద్వార విజ్ఞానం ఎగ్జిబిషన్ స్టాల్‌లో కౌండిన్య, మెంటరింగ్, కౌన్సిలింగ్ విభాగంలో జిల్లా సైన్స్ అధికారి పాల్గొంటారని పేర్కొన్నారు.

40 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం పట్టివేత


పట్టుకున్న పీడీఎస్ బియ్యం

కోరుట్ల: కల్లూరు శివారులో అక్రమంగా తరలిస్తున్న పీడీఎస్ బియ్యాన్ని ఎస్‌ఐ సతీశ్ శుక్రవారం రాత్రి పట్టుకున్నారు. పట్టుకున్న బియ్యాన్ని రెవెన్యూ అధికారులకు అప్పగించారు. అక్రమంగా బియ్యం తరలిస్తున్న కోరుట్లకు చెందిన పేర్ల వెంకటస్వామి, డ్రైవర్ రమేశ్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ వివరించారు. ఎస్‌ఐ వెంట ఏఎస్‌ఐ, కానిస్టేబుళ్లు ఉన్నారు.

వృద్ధురాలి ఆత్మహత్య

మల్యాల(చొప్పదండి): అనారోగ్యంతో బాధపడుతున్న వృద్ధురాలు మనస్తాపం చెంది ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన లంబాడిపల్లి గ్రామంలో చోటుచేసుకుంది. ఎస్సై చిరంజీవి కథనం ప్రకారం.. లంబాడిపల్లి గ్రామానికి చెందిన గుర్రం సుశీల భర్త ఏడాది క్రితం మృతిచెందాడు. అప్పట్నుంచి సుశీల మానసికంగా కుంగిపోయి, అనారోగ్యంతో బాధపడుతోంది. ఈ క్రమంలో జీవితంపై విరక్తిచెంది ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. మృతురాలి కుమారుడు వెంకన్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నామని ఎస్సై తెలిపారు.

మహిళ హత్య కేసులో యావజ్జీవం

జగిత్యాలజోన్/కోరుట్ల: మహిళను హత్య చేసిన కేసులో అల్లెపు ఎల్లయ్యకు యావజ్జీవ శిక్షతో పాటు రూ.500 జరిమానా విధిస్తూ జగిత్యాల జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి.నీలిమ శుక్రవారం తీర్పు చెప్పారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ ముదుగంటి బాల త్రిపురసుందరి కథనం ప్రకారం.. జిల్లాలోని మేడిపల్లి మండలం కట్లకుంట గ్రామానికి చెందిన దండుగుల పోచయ్యకు ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె పోశాని ఉన్నారు. పోశానికి 14 ఏళ్ల క్రితం వివాహమైంది. కొంతకాలం తర్వాత భార్యాభర్తలు విడిపోయారు. పోశానికి తండ్రి మరో పెళ్లి చేశారు. ఆమెకు కూతురు పుట్టిన తర్వాత భార్యాభర్తలు విడిపోయారు. దీంతో పోశాని కట్లకుంటలోనే తన తండ్రి పోచయ్య వద్ద ఉంటూ కూలీ పనులు చేస్తోంది. ఈ నేపథ్యంలో 2017 జూన్ 23వ తేదీన మేడిపల్లిలో పనిఉందని ఇంట్లోంచి వెళ్లిన పోశాని రాత్రి అయినా ఇంటికి చేరుకోలేదు. ఆమె సెల్‌కు ఫోన్ చేయడంతో ఫోన్ స్విచ్ఛాఫ్ వచ్చింది. బంధుమిత్రులకు సమాచారమిచ్చిన కుటుంబసభ్యులు పలు ప్రాంతాల్లో గాలించారు. అయినా, ఆచూకీ లభించలేదు. మూడు రోజుల తర్వాత కోరుట్ల మండలం మోహన్‌రావుపేట శివారులో ఓ మహిళ మృతదేహం ఉన్నట్లు సమాచారం అందింది. దీంతో వారు అక్కడకు వెళ్లి చూడగా తన కూతురు పోశాని అని తండ్రి గుర్తించారు. ఈక్రమంలో కోరుట్ల పోలీసులకు సమాచారం అందించగా కేసు నమోదు చేసుకున్నారు. మృతురాలి గడియారం, సెల్‌ఫోన్ సంఘటన స్థలంలో కనిపించలేదు. మృతదేహం కుళ్లిపోవడంతో అక్కడే పంచనామా చేశారు. మృతురాలి శరీరంపై బలమైన గాయాలు కావడంతోనే మృతి చెందినట్లు పోలీసులు గుర్తించారు. కోరుట్ల సీఐ రాజశేఖర్‌రాజు సవాల్‌గా తీసుకుని కేసు దర్యాప్తు ప్రారంభించారు. మృతురాలి మొబైల్ నబర్ ఆధారంగా కాల్‌రికార్డ్ పరిశీలించారు. అందులో ఒకే నంబరు నుంచి పలుమార్లు ఫోన్లు రావడం, ఆ రోజే పోశాని మృతిచెందడంతో ఫోన్ చేసిన వ్యక్తే పోశానిని హత్య చేసినట్లు పోలీసులు భావించారు. పలుమార్లు విచారణ జరిపి.. మేడిపల్లి మండలం కట్లకుంటకు చెందిన అల్లెపు ఎల్లయ్య ఈ హత్య చేశాడని నిర్ధారించారు. అతడిని అరెస్ట్ చేసి కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. కోర్టు మానిటరింగ్ టీం సభ్యులు ఎం.కిరణ్‌కుమార్, బి.రాజు సాక్ష్యాలు ప్రవేశపెట్టారు. సాక్ష్యాధారాలు పరిశీలించిన తర్వాత అల్లెపు ఎల్లయ్యకు యావజ్జీవ శిక్షతోపాటు రూ.500 జరిమానా విధిస్తూ జడ్జి తీర్పు చెప్పారు.

సాక్షి క్లాసిఫైడ్స్

SERVICES
ఆయుర్వేదాలయం
■ అన్ని రకముల మందులు, కీళ్ల నొప్పులు, ఉబ్బసం, చర్మ వ్యాధులు, పైల్స్, మధుమేహం, సెక్స్ సమస్యల ప్రభావవంతమైన ఫలితం, వాజీకరణం. డా॥ అశోక్ త్రిపాఠి–సెల్: 7738897455 [K-1141937]

BUSINESS OFFER
■ We Super Stockist of FMCG Products of Masalas & Deserts is looking for District wise Distributors in TS & AP. www.mleps.in Cont: 70329 43367 [Y-748948]

WANTED
■ ప్రముఖ సంస్థ నందు మీ ఇంటి దగ్గర ఉంటూ పార్ట్‌టైం/ఫుల్‌టైం పోస్టల్ కవర్లపై అడ్రస్‌లు వ్రాయుటకు స్త్రీ/పురుషులు కావలెను. నెలకు 10-15వేలు వరకు సంపాదన. ఫ్రీ బుక్‌లెట్ కొరకు 9059509586 [G-776049]
■ స్టార్ హోంకేర్ HYD లో వృద్ధులకు పేషెంట్లకు సేవ చేయుటకు, బేబీ కేర్ ఇంటి/వంట పనికి స్త్రీ/పు కావలెను. జీతం:16000-30K ఫ్రీ వసతి+ భోజనం (టిబి కాల్స్ కావలెను) 8639132775, 8639828228 [H-793255]
■ విష్ యూ విజన్ సెక్యూరిటీస్ కరీంనగర్ ఆఫీసులో పనిచేయుటకు అకౌంట్స్, లేడి రిసెప్షనిస్ట్ కావలెను. సెల్: 7799933554, 9553322000 [K-1141939]
■ అంజన్న హోమ్‌కేర్ పెద్దవారికి పేషెంట్ కేర్/ఇంటి/వంటపని చేయుటకు ఆయాలు, వార్డ్‌బాయ్స్, Exp. స్త్రీ/పు/నర్సులు కావలెను. జీతం: 18,000/- నుండి 25,000/- వరకు ఇవ్వబడును. కూకట్‌పల్లిలో Hyd. Ph: 9966568882, 9963489661 [HA-900]

www.sakshi.com

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

For Classifieds, Advertisements Contact:
9951602933, 9951602824